సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 22 । జూన్ । 2024



వ్యాధుల కాలం..పశువులు భద్రం

వర్షాకాలం మొదలైతే చాలు మనుషులకే కాదు మూగ జీవాలకు వ్యాధుల ముప్పుతప్పదు. పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. -8లో



విశ్వవిద్యాలయ కీర్తిని పెంచేలా పరిశోధనలు

యోగి వేమన విశ్వవిద్యాలయం కీర్తిని పెంచేలా పరిశోధనలు సాగాలని వైవీయూ వీసీ చింతా సుధాకర్ సూచించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.760	రూ.880
రెండోరకం	రూ.650	రూ.750

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 788 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు పులివెందులకు వైఎస్ జగన్ రాక



పులివెందుల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (శనివారం) పులివెందులకు రానున్నారు. శనివారం ఉదయం 11గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 11.20గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో కడపకు బయలుదేరుతారు. 12.15గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.25 గంటలకు కడప నుంచి పులివెందులకు రోడ్డుమార్గాన బయలుదేరుతారు. 1.25గంటలకు పులివెందులలోని భాకరాపురంలో గల స్వగృహానికి చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

విశేషాలంకరణలో ఏనుగు మల్లమ్మ



బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఏనుగు మల్లమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నాగపడిగ, పట్టుచీర, నగలను అలంకరించి పూజలు చేశారు.

పీలేరు గ్రామ పంచాయతీ అక్రమాలపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ

పీలేరు: పీలేరు గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై సర్పంచ్ హబీబ్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజ పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. జరిగిన అక్రమాలపై నివేదికను కలెక్టర్‌కు, డీపీఓకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారంపాండు పనుల తనిఖీ



రామసముద్రం మండలం మాలేనత్తంలో ఫారం పాండు పనులను పరిశీలిస్తున్న పీడీ మద్దిలేటి

రామసముద్రం: ఉపాధిహామీ పథకం కింద పని చేసిన ఫారం పాండు, పండ్లతోటల పెంపకాన్ని శుక్రవారం ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, ఏపీడీ నందకుమార్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని మాలేనత్తం పంచాయతీకి చెందిన భాస్కర్‌రెడ్డి ఫారంపాండు పనులను పరిశీలించారు. అలాగే నారిగానిపల్లె పంచాయతీకి చెందిన జి.శ్రీనివాసులురెడ్డి, జి.నరేష్‌కుమార్‌రెడ్డి మామిడి తోటలోని మొక్కలకు రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించారు. పెంపకం పనులు చేపట్టిన రైతులకు కూలీ పనిదినాలతో పాటు ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గౌరిశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరలు ఘనం.. దిగుబడి శూన్యం!

- విభిన్న వాతావరణంతో తగ్గిన టమాటా సాగు
- మార్కెట్లో కిలో టమాటా రూ.80 నుంచి రూ.90
- ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు
- బయటి రాష్ట్రాలకు నిలిచిపోయిన ఎగుమతులు



స్టాకులేక వెలవెలబోతున్న టమాటా మండీలు

గుర్రంకొండ: ధరలు ఘనం దిగుబడి శూన్యంగా మారింది టామాట రైతుల పరిస్థితి. మొన్నటి వరకు దిగుబడి ఎక్కువగా ఉండగా ధరలు బాగున్నాయి. టమాట ధరలు ఘనంగా ఉన్నా ఓ వైపు ఎండలు మరో వైపు వర్షాభావంతో నెలకొన్న విభిన్న వాతావరణంతో తోటలు దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో మార్కెట్లో టమాటాల స్టాకు లేక మండీలు వెలవెలబోతున్నాయి. నెల రోజుల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో స్టాకు ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పుంజుకున్నా దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. మార్కెట్లో కిలో టమాటా ధరలు రూ.80 నుంచి రూ.90 వరకు పలుకుతున్నాయి. ఈ ఏడాదిలో ఈ ధరలే అత్యధికం కావడం గమనార్హం.

ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు

జిల్లాలో ఈ ఏడాది టమాటా ధరలు అత్యధికంగా పలుకుతుండడం ఇదే మొదటిసారి. ఈ ఏడాదిలో అత్యధికంగా ఇప్పటి వరకు రూ. 900లోపే టమాటా ధర మార్కెట్లో పలికింది. 15 రోజుల క్రితం 30 కేజీల టమాటా క్రేట్ ధరలు అత్యధికంగా రూ.800 లోపే ఉన్నాయి. అయితే గత వారం రోజులుగా టమటా ధరలు నిలకడగా ఉన్నాయి. ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ.1900 నుంచి రూ.2100 వరకు పలుకుతున్నాయి. గత కొన్ని రోజులుగా మార్కెట్లో టమాటా ధలు హెచ్చుతగ్గులు లేకుండా ఇవే ధరలు నిలకడగా ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

విభిన్న వాతావరణంతో దెబ్బతిన్న తోటలు

ప్రస్తుతం గత నెల రోజులుగా జిల్లాలో విభిన్న వాతావరణం కారణంగా టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. ఓ వైపు మండే ఎండలు, మరోవైపు భారీ వర్షాలతో ఎన్నడూ లేని విధంగా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి ఉక్కబోతతో కూడిన ఎండలు, మధ్యాహ్నం లేదా సాయంకాలం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో టమాటా తోటలు దెబ్బతిని పంట దిగుబడి దారుణంగా పడిపోయింది. తోటల్లో ఉన్న కాయలు దెబ్బతింటున్నాయి. ఎన్ని రసాయనిక, సేంద్రియ మందులు పంటలపై పిచికారీ చేస్తున్నా కాయల సైజు రావడం లేదు. దీంతో కాయల సైజు భారీగా దెబ్బతిని గోలీలుగా మారుతున్నాయి. కాగా తోటల్లో పంటకు ఉన్న పూత పిందెలు విచిత్ర వాతావరణ ప్రభావంతో రాలిపోయి తోటలు దెబ్బతింటున్నాయి.

నిలిచిపోయిన ఎగుమతులు

జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల పరిధిలోని మండీల నుంచి గత నెల వరకు ప్రతిరోజు 185 నుంచి 225 లారీల టమాటాలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. రాష్ట్రంలోని నరసరావుపేట, మార్కాపురం, గుంటూరు, బద్వేలు, ప్రొద్దుటూరు తోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇక్కడి టమాటాలు ఎగుమతి అయ్యేవి. వీటితోపాటు ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కలకత్తా, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి టమాటాలను తరలించేవారు. అయితే నేడు 74 నుంచి 85 వాహనాల్లో మాత్రమే టమాటాలు బయట ప్రాంతాలకు వెళుతున్నాయి. ముఖ్యంగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రస్తుతం టమాటాలను వాహనాల ద్వారా పంపిస్తున్నారు. వాతావరణం కారణంగా టమాటాల స్టాకు పూర్తిగా తగ్గిపోవడంతో బయట రాష్ట్రాలకు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

గత వారం రోజులుగా మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు ఇలా..

తేది	స్టాకు (మెట్రిక్ టన్నుల్లో)	ధరలు (25కేజీల క్రేట్)
15	542	రూ.1550
16	587	రూ.1620
17	380	రూ.1750
18	446	రూ.1870
19	416	రూ.2120
20	435	రూ.2000
21	420	రూ. 1950

845 నుంచి 420కు పడిపోయిన దిగుబడి



జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా మండీలకు వస్తున్న టమాటాల స్టాకు సగానికి పైగా పడిపోయింది. వారంరోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 845 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మండీలకు వచ్చేది. ప్రస్తుతం 420 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే మండీలకు వస్తోంది. ఈ ఏడాది వరుసగా కురిసిన వర్షాలతో రైతులు భారీగా నష్టపోయారు. వర్షాలతో టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా టమాటా పంట దిగుబడి ఈనెలలో అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 1250 టన్నుల టమాటా పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఈ సీజన్‌లో అత్యల్పంగా కేవలం 420 టన్నుల టమాటా పంట దిగుబడి వస్తుండడం గమనార్హం.

మూతపడ్డ మండీలు

టమాటాల స్టాకు లేక జిల్లాలో చాలామండీలు మూతపడ్డాయి. జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో మొత్తం 445 మండీలు ఉన్నాయి. గత నెలవరకు 345 మండీలను నిర్వహించేవారు. ప్రస్తుతం కేవలం 215 మండీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. మిగిలినవి మూతపడ్డాయి. పంట దిగుబడి లేకపోవడంతోపాటు మండీలకు స్టాకు రాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి ఇంకా కొన్ని రోజులుగా ఇలాగే ఉండే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

దిగుబడి తగ్గిపోయింది

యార్డులోని టమాటా మండీలకు టమాటాల స్టాకు రావడం లేదు. టమాటా దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ప్రసుతం ఉన్న వాతావరణం కారణంగా టమటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో చాలా వరకు పంట దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం టామాటా ధరలు నిలకడగా ఉన్నాయి. అయితే అందుకు తగినంతగా స్టాకులేక పోవడంతో వ్యాపారం బాగా దెబ్బతింది.

– కుమార్,
మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

యోగాను దినచర్య చేసుకోవాలి



భుజంగాసనంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

రాయచోటి: యోగాను ప్రతి ఒక్కరూ తమ దినచర్యగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగా శిక్షకుల పర్యవేక్షణలో యోగా దినోత్సవానికి హాజరైన విద్యార్థులతో కలిసి కలెక్టర్ వివిధ రకాల ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మనకోసం, సమాజం కోసం యోగా అనే థీమ్‌తో యోగావల్ల వ్యక్తిగత, సామాజిక ఆరోగ్య భద్రత పట్ల అవగాహన కల్పించేలా జరుపుకుంటున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వయస్సుల వారు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలుగుతారన్నారు. యోగాసనాలు మన పూర్వీకులు మనకు అందించడం మన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పనిచేయాలి

జిల్లాలోని సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ మహిళా శిశు సంక్షేమం, సంక్షేమశాఖల కార్పొరేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ సంక్షేమ శాఖలలో అమలు చేస్తు న్న పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ఇన్‌చార్జి అధికారి వెంకటసుబ్బయ్య, బీసీ మైనార్టీ సంక్షేమ అధికారులు సందప్ప, మస్తాన్, ఐసీడీఎస్ అధికారిణి శశికళ, సీపీఓ కృష్ణా నాయక్, ఇండస్ట్రీస్ జీఎం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక వికాసం

సంబేపల్లె: యోగాతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి అన్నారు. సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 1200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ యోగాను జాతి, మత, కుల, లింగ భేదం, చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎవరైనా ఆచరించవచ్చన్నారు. హింస, ఘర్షణలతో సతమతమవుతున్న ప్రపంచ మానవులందరినీ శాంతి మార్గంలో నడిపించేందుకు యోగా దోహదపడుతుందన్నారు. అనంతరం యోగా శిక్షకురాలు విజయలక్ష్మీ సూక్ష్మ వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామాలతోపాటు అనేక ఆసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెజరర్ ఓబుల్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, యోగా జిల్లా నోడల్ అధికారి జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడపరాయా..కరుణించవయ్యా

ముగిసిన సహస్ర కలశాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి శుక్రవారం కలశాభిషేకం నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో స్థానిక అర్చక బృందం టీటీడీ ఆగమ సలహాదారులు విజయభట్టర్ పర్యవేక్షణలో మూడు రోజుల సహస్ర కలశాభిషేకాన్ని బుధవారం నుంచి ప్రారంభించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాలను సక్రమంగా కొనసాగేందుకు నిరంతర పర్యవేక్షణ చేశారు. ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామికి ద్వారతోరణ పూజ, పాలికారాధన, శ్రీచక్ర మండలారాధన, సముద్రాలు, నదుల నుంచి సేకరించిన జలాలతో నింపిన కలశాలకు విశేష అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ రంగమండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని, శ్రీ పద్మావతి అమ్మవారిని కొలువుదీర్చారు. తొలుత పద్మావతి అమ్మవారి మూర్తిని కలశంలోని పవిత్ర జలాలతో అభిషేకించి పరిమళ ద్రవ్యాలను అర్పించారు. అర్చకుల వేద మంత్రోచ్చాటనలు, వెయ్యి కలశాలతో స్వామి, అమ్మవార్లను అభిషేకిస్తున్నంత సేపు ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణతో ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా మూర్తి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులందరికీ కర్పూర హారతులు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్ బృందం మూడు రోజుల కార్యక్రమాలను దిగ్విజయం చేయడంలో ప్రధానపాత్ర పోషించారు.

డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు

రాయచోటి: జిల్లాలో విస్తృతంగా డయేరియా శిబిరాలు నిర్వహించి డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అతి సార కేసుల వ్యాప్తి(స్టాప్ డయేరియా క్యాంపెయిన్) తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

- వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు విస్తృతంగా చేపట్టాలన్నారు.

దుర్గంధంలో ఆంధ్రా ఊటీ!

- హార్సిలీహిల్స్‌పై కానరాని పారిశుద్ధ్యం
- గాలిబండపై ముక్కు మూసుకుంటున్న పర్యాటకులు
- రోడ్లపై విచ్చలవిడిగా వ్యర్థాల పారబోత
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు





గాలిబండపై సిమెంటు తొట్టెలో నిండిపోయిన వ్యర్థాలతో దుర్గంధం, రోడ్లపై ప్లాస్టిక్, చెత్త చెదారం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని ఆంధ్రాఊటీ హార్సిలీహిల్స్ పేరు వింటే చల్లటి ఆహ్లాదం, ప్రకృతి అందాలు గుర్తొస్తాయి. ఇప్పుడు హార్సిలీహిల్స్ దుర్గంధం వెదజల్లుతూ అపరిశుభ్రత, ఆహ్లాదకర ప్రాంతాల్లో నిండిపోయిన చెత్త కనిపిస్తోంది. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని ఆంధ్రా ఊటీ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెతకు తగ్గట్టుగా మారిపోయింది. హార్సిలీహిల్స్ అంటే మద్యం సేవించడం, విందులు చేసుకోవడం కోసమే అన్న అభిప్రాయం ఎక్కువైంది. కొరవడిన పారిశుద్ధ్యం కారణంగా కొండపై వాతావరణం దెబ్బతింటోంది. దీనికితోడు ఇక్కడ వాడి పడేసే వ్యర్థాలు రోజురోజుకు అధికమవుతున్నాయి.

గాలిబండపైకి వెళ్లాలంటే భయం

కొండపై గాలిబండ ప్రత్యేకమైన ప్రాంతం. ఇక్కడ నిలబడితే సమీపంలో కర్ణాటక ప్రాంతం, సరిహద్దుల్లో విస్తరించిన పచ్చని అడవి, అత్యధిక వేగంతో వీచే గాలిని ఆస్వాదించేందుకు పర్యాటకులు ఇష్టపడతారు. ప్రస్తుతం ఇక్కడికి రావాలంటే జంకే పరిస్థితి ఏర్పడింది. గాలిబండపై వినియోగించి పడేసే వ్యర్థాలు అధికంగా ఉంటున్నాయి. ఇక్కడ నిర్మించిన సిమెంటు తొట్టిలో కవర్లతో వాడేసిన వ్యర్థాలతో నింపేస్తున్నారు. వీటిని తొలగించకపోవడంతో పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పర్యాటకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. గాలిబండ మీదుగా రాకపోకలు సాగించే పర్యాటకులదీ ఇదే పరిస్థితి. ఈ వ్యర్థాలను ఎందుకు తొలగించడం లేదో తెలియడం లేదు. ఆర్డీఓ చైర్మన్‌గా ఉండే టౌన్‌షిప్ కమిటీ పారిశుద్ధ్య పనులు చేయిస్తోంది. గత ఆర్డీఓ మురళి, గత కలెక్టర్ గిరీషా హార్సిలీహిల్స్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుని పారిశుద్ధ్య కార్మికులను నియమించి పనులు నిర్వహించేవారు. ఇప్పుడు ఈ పనులను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఫలితం ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఎక్కడి చెత్త అక్కడే!

పర్యాటకులు కొండకు వస్తే వినియోగించే నీళ్ల బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ పేపర్లు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. రోడ్లనిండా ఇవే కనిపిస్తున్నాయి. పర్యాటకులకు తగు సూచనలు చేయడం, పారబోసే వాటికోసం కనీసం చెత్త బుట్టలు ఏర్పాటు చేయకపోవడంతో ఖాళీ నీటి బాటిళ్లే కాదు మద్యం సీసాలు రోడ్డుపైనే విసిరేస్తున్నారు. వీటివల్ల కుటుంబాలతో వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. కొండపైనున్న గాలిబండపైన ఈ పరిస్థితి మరింత దారుణం. తాగేసిన బాటిళ్లను నేలకేసి పగులగొడుతున్నారు. గాజుపెంకుల మధ్యలోనే సందర్శకులు గాలిబండపై సంచరించాల్సి వస్తోంది. కొండపైకి వచ్చే కాలం చెల్లిన వాహనాలు వెదజల్లుతున్న పొగ కాలుష్యం దీనికి అదనం. ఈ పొగ కాలుష్యం వాతావరణంలో నేరుగా కలుషితమై ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికులు వినియోగించే నీటికి డ్రైనేజీ వ్యవస్థ లేనందున మురికినీరు రోడ్లపైనే ప్రవహిస్తూ సందర్శకుల్లో అసహనం కలిగిస్తోంది. ఈ ఇబ్బందులపైనా, వాతావరణ కాలుష్యం విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పెద్దమండ్యం : మండల సరిహద్దులో జూదమాడుతున్న ఎనిమిది మందిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపేపల్లె పంచాయతీ గొర్లవానికుంట సమీపంలో జూదమాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మదనపల్లె, సంబేపల్లె, ఎన్పీ కుంట, గోరాన్‌చెరువు ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది జూదరులు పట్టుబడగా, మరో నలుగురు పరారైనట్లు చెప్పారు. వారి నుంచి రూ.1.15లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహించినా, నాటుసారా విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలంలోని సీటీఎం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం మోతీ నగర్‌కు చెందిన షేక్ అష్రఫ్(21) సీటీఎం వద్దనున్న ఓ ఫార్మసీ కాలేజీలో చదువుతున్నాడు. కాలేజీ నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. సీటీఎం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో షేక్ అష్రఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

వాటర్‌మెన్ ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసులు

మదనపల్లె సిటీ : అప్పులిచ్చినవారి వేధింపులు తాళలేక ఓ వాటర్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ రామాపురానికి చెందిన శ్రీనివాసులు (58) కుటుంబ అవసరాల కోసం అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులిచ్చినవారు ఇంటి వద్దకు వచ్చి డబ్బు ఇవ్వాలని పట్టుపట్టారు. ఇవ్వకపోతే ఉద్యోగం తీయిస్తాయని బెదిరించారు. దీంతో మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య కాంతమ్మ, కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఘర్షణ కేసులో ఇద్దరి అరెస్టు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ పార్క్ సమీపంలో ఈ నెల 19న రాత్రి జరిగిన ఘర్షణ కేసులో విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, నరసింహాచారి అలియాస్ నరసింహను ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాజారెడ్డి వీధిలో సీఎస్ఐ గ్రౌండ్‌కు వెళ్లే దారిలో సీఐ భాస్కర్ రెడ్డి, సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యాధుల కాలం... పశువులు భద్రం

- వర్షాకాలంలో జాగ్రత్త పడాలంటున్న పశు వైద్యులు
- గొంతు, జబ్బ వాపులకు టీకా వేయించాలి
- దోమల నుంచి పశువులకు రక్షణ అవసరం

పశు సంపద మానవులకు ఎన్నో విధాలుగా మేలు చేస్తుంటుంది. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలం, వాతావరణాన్ని బట్టి మనుషుల లాగే పశువుల్లోనూ వ్యాధులు వస్తుంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర వ్యాధుల బారి నుంచి జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పశుపోషకులు తొలిదశలోనే గొంతువాపు, జబ్బవాపు, దొమ్మ వ్యాధిని గుర్తిస్తే నివారణ సులభమవుతుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.



గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

పులివెందుల రూరల్ : వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు మనుషులకే కాదు మూగ జీవాలకు వ్యాధుల ముప్పుతప్పదు. సూక్ష్మ జీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాధులు ప్రబలడంతోపాటు ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. పాడి రైతులు ఈ సమస్య అధిగమించేందుకు తమ పశువులకు సకాలంలో వైద్య చికిత్స అందించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు మొలిచే లేతగడ్డి మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయని.. చికిత్స చేయించకపోతే పశువు మత్యువాత పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ పాడి రైతులు పచ్చిక బయళ్లలోని లేతగడ్డి అతిగా మేపకుండా ఉండడమే మంచిదని చెబుతున్నారు. వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే చికిత్స అందించాలని సూచిస్తున్నారు.

జబ్బవాపు వ్యాధి

వయసులో ఉన్న ఆరోగ్యవంతమైన పశువుల్లోనూ, తెల్లజాతి పశువుల్లోనూ జబ్బవాపు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతూ మేత మేయక పడుకొని ఉంటుంది. జబ్బ భాగం వాచి, నల్లగా కములుతుంది. కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి పశువు తీవ్ర నొప్పితో బాధపడుతుంది. ఆరు నెలల నుంచి మూడేళ్ల వయసు పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. క్లాస్ట్రీడియం బ్యాక్టీరియా కారణంగా ఈ వ్యాధి పశువులకు వస్తుంది. జ్వరం తీవ్రంగా ఉండడం, శ్వాస పెరగడం, కాలు కుంటడం, భుజం భాగాన వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకినప్పుడు పశువులకు పెన్సిలిన్, యాంటిబయోటిక్స్ పెయిన్‌కిల్లర్ వంటి మందులు వాడాలి.

గొంతువాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న నల్లజాతి గేదెల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాధి సోకిన పశువుకు అకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. పశువు మేత మేయదు. గొంతుపైన, మెడ కింద వాపు కన్పిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. పశువు వణుకుతూ ఉంటుంది. దవడ మధ్యన, గొంతుపైన వాపు వస్తుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువైతే పశువు దగ్గుతూ, చివరికి అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోతుంది. ఈ వ్యాధి సోకినప్పుడు వెంటనే పశువుకు చికిత్స అందించాలి.

అపరిశుభ్రత ఉండరాదు...

నేల చిత్తడిగా, వాతావరణం అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో, నీరు నిల్వ ఉన్న గుంతల్లో, మురుగు కాల్వల్లో ఈగలు, దోమలు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి ఆహారం కోసం పశువులను పట్టి పీడిస్తుంటాయి. వర్షాకాలంలో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈగలు, దోమలు శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. వీటి తాకిడి కారణంగా పశువులు పడుకోలేవు. నిలబడలేవు. వాటిని వదిలించుకోవడానికి తోకను అటూ ఇటూ కొట్టుకుంటూ, చెవులు ఊపుతూ అసహనానికి గురవుతాయి. కడుపునిండా మేత మేయలేవు. ఫలితంగా పశువులు రక్త హీనతకు లోనవుతాయి. ఈగలు, దోమ కాటుతో పశువు శరీరంపై పుండ్లు పడతాయి. ఈగలు, దోమల నివారణకు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్ పిచికారీ చేయాలి. మురుగు నీరు చేరే చోటు, చిత్తడి ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువుల పాకలో ఎండు పిడకలు, వేపాకుతో పొగబెట్టాలి. వైద్యుల సలహా మేరకు పశువు శరీరంపై కీటక నాశనులను పిచికారీ చేయాలి. సాయంకాలం వేళ పశువుల శరీరంపై వేపనూనె రాయాలి. సీజన్‌కి తగ్గట్టుగా టీకాలు వేయించాలి, మురుగు నీరు తాగించకుండా శుభ్రమైన నీటినే తాగించాలి. పశువుల షెడ్లు, పాకలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కొండాపురం : మండలంలోని కొండాపురం నివాసముంటున్న బసిరెడ్డి వెంకటక్రిష్ణ(31) ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా తూర్పు యర్రబల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి వెంకటక్రిష్ణ కొండాపురంలో నివాసముంటూ బేల్దారి పనులు చేస్తున్నారు. ఈ నెల 16న లావనూరు గ్రామంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో వస్తుండగా డొంకపల్లె వద్ద ద్విచక్ర వాహనం టైర్ పంక్చరై స్కూటర్ అదుపు తప్పి కింద పడ్డాడు. అనంతపురం పట్టణంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి వివాహం కాలేదని, కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

యజమానికి మొబైల్ ఫోన్ అందజేత



ప్రయాణికుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిత్తూరు–కాచిగూడ మధ్య నడుస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణీకుడు తన మొబైల్ ఫోన్‌ను గురువారం రాత్రి మరిచిపోయాడు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న టీటీఈ ఎలిజిబెత్‌రాణి ఫోన్ గుర్తించి దానిని ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులకు అప్పగించారు. శ్రీనివాసులు ఆ ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణీకుడు శైలేంద్రసింగ్‌ను శుక్రవారం ఉదయం సంప్రదించి.. తమ వద్ద మొబైల్ ఉందని తెలియజేశారు. అనంతరం వచ్చిన ప్రయాణికుడికి మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా టీటీఈ ఎలిజిబెత్ రాణి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుల్ సౌజన్యను సీఐ శ్రీనివాసులు అభినందించారు.

నిరంతర విద్యుత్ అందించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ



బోరెడ్డిగారిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

చిన్నమండెం: వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని విద్యుత్ శాఖ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రమణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లె సబ్‌స్టేషన్‌ను, పడమటికోన ప్రాంతాలలోని ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రైతులను వ్యయప్రయాసాలకు గురికానీయకుండా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ విజయకుమార్‌రెడ్డి, ఏఈ రాజేష్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు జవసత్వాలు

జిల్లా కార్యదర్శిగా ప్రమీల, కోశాధికారిగా శివశంకర్‌రెడ్డి



ఎం. అనూరాధ



డి. ప్రమీల, కార్యదర్శి



బి. శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : జిల్లాలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు నూతన అధికారులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్యాట్రన్‌గా, ప్రెసిడెంట్‌గా కలెక్టర్ వి.విజయరామరాజు, వైస్ ప్యాట్రన్‌లుగా ఎం.వి.రామచంద్రారెడ్డి (ఎంఎల్‌సీ), వైవీయూ వైస్ చాన్సలర్, కృషివిజ్ఞానకేంద్రం ప్రిన్సిపల్, కడప మున్సిపల్ కమిషనర్, జిల్లా ఎస్పీ వ్యవహరిస్తారు. వైస్ ప్రెసిడెంట్లుగా జేసీ జి.గణేష్ కుమార్, జడ్పీ సీఈఓ డా.కె.లలిత, వైవీయూ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్.అరుణకుమారి, వ్యవహరిస్తారు. జిల్లా చీఫ్ కమిషనర్‌గా జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ వ్యవహరిస్తారు. ఆమెతో0పాటు నూతన జిల్లా కార్యదర్శిగా బద్వేలు ఎంఈఓ–2 డి.ప్రమీల, కోశాధికారిగా పెండ్లిమర్రి మండలం గంగసపల్లె ఫిజికల్ డైరెక్టర్ బి.శివశంకర్ రెడ్డిలను నియమించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.వెంకటసుబ్బయ్య (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, చెన్నూరు), అసిస్టెంట్ సెక్రటరీగా బి.ఖాదర్‌బాషా(ఎస్ఏ జెడ్పీహెచ్ఎస్, కందిమల్లాయపల్లె, బి.మఠం)లను నియమించారు. ట్రైనింగ్ కమిటీ, బ్యాడ్జ్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీలకు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఫిజికల్ డైరెక్టర్లతో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

తప్పిన ప్రమాదం



విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న క్రేన్

అట్లూరు : అట్లూరు మండలం నబీఆబాద్ గ్రామ సమీపాన ఓ క్రేన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. కడప–బద్వేలు రహదారి పక్కనే విద్యుత్తు లైన్ ఉంది. శుక్రవారం ఉదయం బద్వేల్ నుంచి కడప వెళ్తున్న ఓ క్రేన్ ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగి క్రేన్ మీదనే పడింది. విద్యుత్తు సిబ్బంది సరఫరా నిలిపేసి క్రేన్ తొలగించారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెడ్పీ చైర్ పర్సన్ శారద

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా కేంద్రంలోని అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శారద శుక్రవారం తనిఖీ చేశారు. జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి , తదితర అధికారులు ఆయా విభాగాల్లో విధుల గురించి ఆమెకు వివరించారు.

శాఖాపరంగా ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని, పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. జడ్పీ ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి జెడ్పీ చైర్ పర్సన్‌ను ఆమె కోరారు.

వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాలనడం తగదు

కడప కార్పొరేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్‌ఎఫ్ నాయకులు కోరడం దారుణమని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సాయిదత్త అన్నారు. విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన సేవలకు గుర్తుగా ఏర్పాటు చేశారన్నారు. 2004కు ముందు కేవలం పీజీ సెంటర్‌ను యోగి వేమన యూనివర్సిటీగా తీర్చిదిద్దిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అక్కడి భవనాలను నిర్మించారని, ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా విద్యా రంగానికి ఆయన చేసిన మేలు ఎవరూ మరవరాదన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఇలాంటి కక్ష పూరిత రాజకీయాలతో యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. పదహారు సంవత్సరాలుగా ఆ విగ్రహం అక్కడ ప్రతిష్ఠించబడి ఉందని, దానిని తొలగించాలని చూస్తే వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ సహించదన్నారు. ఒకప్పుడు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన వ్యక్తే నేడు విగ్రహాన్ని తొలగించాలని వినతిపత్రం ఇవ్వడం శోచనీయమన్నారు. ఎన్ని పోరాటాలు చేసైనా సరే వైఎస్సార్ విగ్రహాన్ని అలాగే నిలుపుకొంమని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడప అర్బన్ : కడప నగర శివారులోని గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రాజమోహన్ (58) శుక్రవారం మృతి చెందారు. ఈ సంఘటనలో రామయ్య, రాజమోహన్ కుమారుడైన గురు రోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజమోహన్, అతని భార్య లక్ష్మిదేవిలో ఒకరైన రాజమోహన్ మృతిచెందాడు. ఈ సంఘటనలో రాజమోహన్ మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నారాయణ తెలియజేశారు.

అటవీ శాఖ బీట్ల పునర్విభజనకు ప్రతిపాదనలు

– సిద్దవటం రేంజర్ కళావతి



సిద్దవటం : దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ శాఖ బీట్ల పునర్విభజన కొరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరులతో ఆమె మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లో రెండు సెక్షన్లు, ఏడు బీట్లు ఉన్నాయని, వాటిని ఆరు సెక్షన్లు, 23 బీట్లుగా విభజించేందుకు నివేదిక పంపామన్నారు. సిబ్బందిపై పని ఒత్తిడిని తగ్గించేందుకు, అడవులను సమర్థంగా కాపాడటానికి, భూ ఆక్రమణలు జరగకుండా నివారించడానికి కసరత్తు జరుగుతోందన్నారు. బీట్ల పునర్విభజన జరిగితే ఎర్రచందనం, వన్యా ప్రాణులను కాపాడటం సులభమౌతుందన్నారు. కార్యక్రమంలో సిద్దవటం బీ ట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకు రాలేదని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



సృజనను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

చిట్వేలి : నీట్ పరీక్షలో ర్యాంకు రాలేదని మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిట్వేలి మండలం మల్లెంపల్లికి చెందిన లక్ష్మీనారాయణకు కుమార్తె సృజన(18), కుమారుడు ఉన్నారు. కష్టపడి చదివిన సృజనకు ర్యాంకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి చిట్వేలి గుంజన నది వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సుధాకర్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సృజనను రాజంపేట ఆస్పత్రికి తరలించారు.

విశ్వవిద్యాలయ కీర్తిని పెంచేలా పరిశోధనలు

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం కీర్తిని పెంచేలా పరిశోధనలు సాగాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమవడంతో వైవీయూ సెమినార్ హాల్‌లో అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ నుంచి రూ.3.5 కోట్ల నిధులతో 53 మందికి ప్రాజెక్టులు రావడంతో అధ్యాపకులను ఆయన అభినందించారు. తమ పరిశోధనల ప్రగతి చూసి జాతీయ సంస్థలు ఇంకా ప్రాజెక్టులు మంజూరు చేసే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ పరిశోధకులైన స్కాలర్లకు ఆర్థిక సమస్యలు తీరుతాయన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ విద్యార్థుల సమాధానపత్రాల మూల్యాంకనం పూర్తిచేసి ఫలితాలు వెంటనే విడుదల చేసేలా సహకరించాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ రూసా ప్రాజెక్టులందుకున్న అధ్యాపకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి, ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అద్దె బస్సుల్లో పని చేస్తున్న డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగువెంకటేశ్వరరావు సూచించారు. కడప ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్ర వారాల్లో కడప డీపీటీఓ కార్యాలయంలో ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, కడప, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రయాణీకులను గౌరవిస్తే సంస్థపై వారికి మంచి అభిప్రాయం ఉంటుందని సూచించారు. రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు డ్రైవర్లకు ప్రమాణ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఓం శాంతి యోగా గురువు ఓబయ్య డ్రైవర్లతో యోగ ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ పాలిమేర గోపాల్‌రెడ్డి, కార్గో మేనేజర్ హరి, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మరొకరు



మృతి చెందిన దూదేకుల హుసేన్

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు దూదేకుల హుసేన్‌వలి(34)పెద్దముడియం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్ఐ హనుమంత్ తెలిపారు. ఈ నెల 18న పనినిమిత్తం మండలంలోని గొల్లపల్లిలోని మునిరెడ్డి కంకర మిషన్ వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేయడానికి వచ్చి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడికి భార్య కరీమున్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానాస్పదం గా ఉండటంతో విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిసార నియంత్రణకు చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లాను అతిసారం రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి, అతిసారం కేసులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని, వర్క్‌షాప్‌లు, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్నారులకు జింక్ ప్యాకెట్లు అందించాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుద్య పరిరక్షణా చర్యలు చేపట్టాలన్నారు. తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె : ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున సానిపాయి బీటు కాల్వ బండ ప్రదేశంలో అక్రమంగా ఎర్రచందనం తరలించేందుకు సిద్ధంగా ఉన్న వారిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వద్ద ఒక ద్విచక్ర వాహనం, ఆరు ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వాటి విలువ రూ.45,341లు ఉంటుందని, మరింత మంది గుర్తు తెలియని వ్యక్తులు పరారైనట్లు ఫారెస్ట్ రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

ఆర్టీసీలో విశేష సేవలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ ఎండీగా నియమితులైన ద్వారకా తిరుమలరావు ఎన్నో సేవలందించారని ఆర్టీసీ యూనియన్ నాయకులు కేకే.కుమార్, బాబా ఫక్రుద్దీన్, శివారెడ్డి, పురుషోత్తం, సగినాల శ్రీనివాసులు, ఏఆర్ మూర్తి అన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావుకు వారు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ కారుణ్య నియామకాలకు ప్రభుత్వ అనుమతి పొంది ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు.